# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆధునిక సాంకేతికతలు, ఆవిష్కరణలు, తయారీ రంగాల్లో అమరావతిని ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- పి.ఎం. సూర్యఘర్ పథకం ద్వారా 20 లక్షల ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ.. క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని ఈగల్ చీఫ్ రవికృష్ణ పిలుపునిచ్చారు.
- నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలో మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సురక్షిత కమ్యూనికేషన్లు, విశ్వాసనీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత భవిష్యత్ ప్రపంచానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. సీ - డాట్, భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల విభాగం, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో దేశంలోనే మొట్టమొదటి "క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్" ఏర్పాటు కానుందని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి ఊతమివ్వనుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతికతలు, డీప్‌టెక్ ఇన్నోవేషన్, అధునాతన తయారీ రంగాల్లో అమరావతిని ప్రపంచ స్థాయి కేంద్రంగా నిలబెట్టడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, అంకుర సంస్థలు, యువ ఆవిష్కర్తలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

==================

జూన్ 12 నుంచి వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఈరోజు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలోనే వితంతు పింఛన్లకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

==================

ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అనంతపురంలోని లలిత కళా పరిషత్ లో కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తల్లికి వందనం పథకాన్ని రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

==================

ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవాలు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తెల్లవారుజామునే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాడేరుతో పాటు అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు తదితర మండలాల నుండి వేలాది మంది గిరిజన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని.. సంప్రదాయం ప్రకారం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంతి, ఎస్పీ అమిత్ బర్దార్ పాల్గొన్నారు.

విరామం

==================

పి.ఎం. సూర్యఘర్ పథకం ద్వారా 20 లక్షల ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం కోటికపూడి గ్రామంలో మంత్రి ఈరోజు పలు అభివృద్ధి పనులను, "పీఎం సూర్యఘర్" పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా పేద గృహాలకు విద్యుత్ భారం తప్పుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సూర్యఘర్ కనెక్షన్లను ఉచితంగా, బీసీలకు 20 వేల రూపాయల రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ (RDSS) పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులన్నింటినీ వేగంగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

==================

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పాలకొల్లు పట్టణంలో తాగునీటి ఎద్దడి సమస్యపై ఈరోజు మున్సిపల్ వాటర్ వర్క్స్‌ను ఆకస్మికంగా సందర్శించి తాగునీటి చెరువుల్లో ఉన్న నీటి నిల్వలను స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటి పరిమాణం ఎంత, ఇంకా ఎన్ని రోజుల వరకు సరఫరా చేయగలమనే అంశాలపై అధికారులతో సమీక్షించారు. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తుగా ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు

తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. రానున్న రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల తక్షణమే బోరు బావుల తవ్వకాలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

===================

యువత మత్తు పదార్థాల వంటి వ్యసనాలకు బానిసలు కాకుండా.. క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని ఈగల్ చీఫ్ రవికృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో "ఫ్యాక్టరీ క్లబ్ క్రికెట్ లీగ్" పోటీలను జిల్లా ఎస్పీ నాగేష్‌తో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ.. యువతలోని అనంతమైన శక్తి సామర్థ్యాలను సానుకూల మార్గంలో మళ్లించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో ఈగల్ ఆధ్వర్యంలో `ఈగల్ క్లబ్స్` ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

===================

మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రేపు కలెక్టరేట్ లో నిర్వహిస్తామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయవచ్చన్నారు. మీకోసం వెబ్ సైట్ లో కూడా అర్జీలను నమోదు చేయవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి తెలిపారు.

===================

నైరుతి రుతుపవనాలు... నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ దీవులు, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రుతుపవనాలు ఈనెల 26వ తేదీ కేరళంలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తమిళనాడుపై ఏర్పడి ఉన్న ఉపరితల ఆవర్తనం ఇప్పుడు ఈశాన్య తమిళనాడులో కేంద్రీకృతమై ఉందన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించారు.

===================
===================